

ఉద్యాన్ పార్కును ప్రారంభిస్తున్న
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బోర్డు నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ

కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కు ప్రారంభం

మారేడ్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ కాలనీలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాలలో అన్ని హంగులతో నిర్మించిన కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కును కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఉద్యాన్ పార్కులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, స్కేటింగ్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం కలిగిన మైదానాన్ని స్థానిక కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు ప్రెసిడెంట్ కె.సోమశేఖర్, బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, సీఈఓ మధుకర్ నాయక్, ఇంజనీర్‌లు, అధికారులు, నాయర్, గోపాలదాస్ కృష్ణ, ఉమాశంకర్, ఫణికుమార్, దినేష్, ఎం.రాజకుమార్, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సూచనలతో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో

● ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



ఉపాధ్యాయుల అభిప్రాయాలను
డ్రాప్ బాక్స్ ద్వారా సేకరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

సికింద్రాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సలహాలు, సూచనలతోనే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందిస్తామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టో రూపొందించనున్న నేపథ్యంలో అన్నివర్గాల ప్రజల సూచనలు తీసుకోవడంలో భాగంగా గురువారం సికింద్రాబాద్ ఆర్‌జీఆర్ సిద్ధాంతి కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది అభిప్రాయాలను డ్రాప్‌బాక్స్ ద్వారా సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కళాశాల చైర్మన్ పి.ఎల్.శ్రీనివాస్, ఓబీసీ మహిళా మోర్చా అధికార ప్రతినిధి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించే ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీనిలో కులసంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్, ఎడెల్లి అజయ్ కుమార్, సి.కృష్ణగౌడ్, సందీప్‌సాయి, వినయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, మేకల సారంగపాణి, పూస రాజు, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న కేటీఆర్'

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల కాంతం విమర్శించారు. రాజకీయాలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గురువారం గాంధీభవన్‌లో గజ్జెల కాంతం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ తీసుకొచ్చిన అన్ని చట్టాలకు మద్దతు ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలిశారని.. ప్రధానిని ఒక ముఖ్యమంత్రి పెద్దన్న అంటే తప్పేమీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే సీఎంగా రేవంత్‌రెడ్డి పీఎం మోదీకి వినతిపత్రాలు ఇచ్చారన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే బీఎస్పీతో సైతం పొత్తుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు.

నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పోస్టుల సంఖ్యను పెంచేలా ప్రయత్నిస్తానన్నారు.

రసాయనశాస్త్రంలో విస్తృత పరిశోధనలు జరగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న
ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా తదితరులు

తార్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని రసాయనశాస్త్రంలో పరిశోధనలు మరింత విస్తృతంగా జరపాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) మాజీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా అన్నారు. నేచర్ ఇన్‌స్పైర్డ్ ఇనిషియేటివ్స్ ఇన్ కెమికల్ ట్రెండ్స్ అనే అంశంపై తార్నాకలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మెహతా మాట్లాడుతూ.. మానవజాతి ఆరోగ్య పరిరక్షణకు రసాయన శాస్త్రం, జీవశాస్త్రంలో సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే అద్భుత ఫలితాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. సదస్సు కన్వీనర్ డా. సీహెచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌తరాలకు ఉపయోగపడే విధంగా నూతన ఆవిష్కరణలు ఏవిధంగా చేయాలి అనే దానిపై మూడురోజుల అంతర్జాతీయ సదస్సులో విస్తృతంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డా.చంద్రశేఖర్, ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటలు సాగుచేసిన వారికి పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటలు సాగుచేసిన వారికి రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని 24 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రైతునేస్తం కార్యక్రమంలో మిద్దెతోటల అంశాన్ని కూడా చేరుస్తామని హామీ ఇచ్చారు. మహిళలు మిద్దెతోటలపై దృష్టిపెట్టాలని, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే కూరగాయలు పండించాలని, ఆరోగ్య తెలంగాణను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, పిన్నక పద్మ పాల్గొన్నారు.

పిస్తాహౌజ్‌లో దాడికి పాల్పడిన ఆరుగురికి రిమాండ్

రాజేంద్రనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటలకు ఉప్పర్‌పల్లి పిస్తాహౌజ్‌లోకి వెళ్లి భోజనాలు చేస్తున్న కస్టమర్లతో పాటు సిబ్బందిపై దాడి చేసిన కేసులో ఆరుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నౌ నంబర్‌కు చెందిన అయూబ్, తాజుద్దీన్, బాబా, షరీఫ్, బబ్లా అలియాస్ ఇమ్రాన్, ముస్తాఫా పిస్తా హౌజ్‌కు వెళ్లి అర్ధరాత్రి బిర్యానీ అడిగారు. సమయం మించిపోయింది. బిర్యానీ లేదని మేనేజర్ మతీన్ తెలిపాడు. దీంతో రెచ్చిపోయిన ఆ ఆరుగురు వ్యక్తులు హోటల్‌లో ఉన్న వారిపై, సిబ్బందిపై దాడి చేశారు. మేనేజర్ మతీన్ ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

కూకట్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదిన వేడుకలకు కూకట్‌పల్లిలో శివాలయాలు ముస్తాబయ్యాయి. వివేక్‌నగర్‌లోని ద్వాదశ భువనేశ్వరి జ్యోతిర్లింగ ఆలయం, కూకట్‌పల్లి గ్రామంలోని పాత శివాలయం, కేపీహెచ్‌బీ కాలనీ మూడో రోడ్డులోని ఏకాంబరేశ్వర స్వామి ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల జాగరణ సందర్భంగా ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.





వివేక్‌నగర్‌లోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం, కూకట్‌పల్లి గ్రామంలో పాత శివాలయం

మహిళా సాధికారతకు ముందుకు సాగాలి

● ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి
● పలు ప్రాంతాల్లో ఘనంగా మహిళా దినోత్సవం



కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో
ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి

కుత్బుల్లాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు ముందుకు సాగాలని మిసెస్ ఇండియా, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్, న్యూట్రిషియన్ శిల్పారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో పట్టణ మహిళా సమాఖ్య(టీఎల్‌ఎఫ్), స్లమ్ మహిళా సమాఖ్య ఎస్‌ఎల్‌ఎఫ్), స్వయం సహకార సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో గురువారం వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలను శిల్పారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు పట్టుదలతో ముందుకుసాగి విజయం సాధించాలని సూచించారు. అంతకు ముందు చిన్నారులు, మహిళలు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి శిల్పారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

● కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఉప కమిషనర్ వి. నర్సింహ, బీజేపీ నాయకుడు కొరిమిళ్ల సంజీవ రెడ్డి ముఖ్య అతిథులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.డీసీ మల్లయ్య, డీపీవోలు హరిప్రియ, హిమబిందు, ఇండియన్ మైక్రోసాట్ బ్యాంక్ మేనేజర్ ఉషారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, జంట సర్కిళ్ల టీఎల్‌ఎఫ్ నాయకులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రభుత్వ పథకాలు

హైదర్‌నగర్: మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పథకాలు అమలు చేస్తోందని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ బస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతోపాటు కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ జెరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి కో-ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నల్ల సంజీవ రెడ్డి, వీరేందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారిత సాధ్యం

చందానగర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని అపోలో హాస్పిటల్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. గంగారం మహిళా దక్షిత సమితి సంస్థలో సరోజ్‌బజాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. సంగీతారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలను సన్మానించారు. ఐఏఎస్ అధికారి డాక్టర్ అలుగు వర్షిణి మాట్లాడుతూ.. మార్పులకు అనుగుణంగా మహిళలు మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. అర్చన హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ స్పందనారెడ్డి, టెక్ మహీంద్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పల్లవి కటియర్, కళాశాల ప్రిన్సిపాల్స్ రమాకుమారి, సుశీలపాటిల్, మహిళా దక్షిత సమితి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

● దీప్తిశ్రీనగర్‌లో శ్రీనిధి స్కూల్ యాజమాన్యం గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో కార్పొరేటర్ మంజులారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలను సన్మానించారు. చందానగర్ శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ జెరిపేటి జైపాల్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులను, పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సన్మానించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంగీతారెడ్డి

పోలీస్ బెటాలియన్‌లో..

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ సన్ని ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ మాట్లాడుతూ..ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్స్ సీతారాం, పార్థసారథి రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిథమ్‌లో..

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటి మేనేజ్‌మెంట్(నిథమ్)లో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. వెస్టిన్ హోటల్ హెచ్ అండ్ ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ రోమిపత్రనబిష్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో..

● వ్యాపార రంగంలో మహిళా పారిశ్రామికవేత్తల కృషి స్ఫూర్తిదాయకమని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ గురు ఎన్ రెడ్డి అన్నారు. గురువారం కాంటినెంటల్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పలు రంగాల్లో ఉన్నతస్థాయిలో పనిచేస్తున్న మహిళలు పాల్గొన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులు, డాక్టర్లను అవార్డులతో సత్కరించారు. వీహబ్ సీఈవో దీప్తిరావుల, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సుతాపబుద్ధవరాయ్, బీజేపీ నేషనల్ పాలసీ ఇన్‌చార్జి కరణగోపాల్ పాల్గొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలతో ఉమెన్ బజార్ నిర్వహించారు.

సీఆర్ ఫౌండేషన్‌లో..

మియాపూర్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ మహిళా అధికారులు, ప్రిన్సిపాల్ కల్పన, మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజని, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్,
చిత్రంలో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ సునీతామహేందర్‌రెడ్డి



పోలీస్ బెటాలియన్‌లో మహిళా దినోత్సవంలో
పాల్గొన్న కమాండెంట్ సన్ని, అధికారులు



మహిళా దినోత్సవంలో
కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ గురు ఎన్ రెడ్డి, మహిళా పారిశ్రామికవేత్తలు



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

గచ్చిబౌలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉచితంగా ఎల్ఆర్ఎస్, బీఆర్‌ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో గురువారం శేరిలింగంపల్లి తహసీల్దార్, జోనల్ కార్యాలయాల ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జోనల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబ్బు తీసుకోకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, షేక్ హమీద్‌పటేల్, మంజులారెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు

పత్రాలు లేకుండా తరలిస్తున్న

రూ. 50 లక్షలు స్వాధీనం

రాయదుర్గం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 50 లక్షలను ఎస్‌వోటీ పోలీసులు ఖాజాగూడలో పట్టుకున్నారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో విక్రమ్ నగేష్ అనే వ్యక్తి సికింద్రాబాద్ నుంచి గుల్బర్గాకు కారులో రూ. 50 లక్షలు తీసుకెళ్తున్నాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు ఖాజాగూడలో అతడిని అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని, రాయదుర్గం పోలీసులకు అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

జీడిమెట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 59 బస్తాల బియ్యం, వాహనం స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మల రామారం మండలం, గోవింద్ తండాకు చెందిన మెడావత్ నవీన్ గురువారం వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆల్విన్ కాలనీ జలకన్య హోటల్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. రూ. 15కు ఇళ్ల వద్ద కొనుగోలు చేసి ఎక్కువ ధరకు మెదక్‌కు చెందిన గోపాల్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. బియ్యం, వాహనం స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కూకట్‌పల్లి డిపో మేనేజర్‌కు నగదు పురస్కారం



సజ్జనార్‌తో మహ్మద్‌బిన్ ఇషాక్

ఫతేనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సిబ్బందిని సమన్వయ పరుస్తూ, ఉత్తమ సేవలందించినందుకు ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో మేనేజర్ మహ్మద్‌బిన్ ఇషాక్ నగదు పురస్కారం అందుకున్నారు. ఆర్టీసీ కళాభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎండీ సజ్జనార్ డీఎంను, సిబ్బందిని అభినందించి ఆయనకు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో డిపో ఏజీఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



మొయినుద్దీన్ (ఫైల్)

రాయదుర్గం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. బీరంగూడలో నివసిస్తున్న మొయినుద్దీన్(52) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున 4.30గంటలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సిగ్నల్ వద్ద ఉన్నాడు. అదే సమయంలో మసీద్‌బండ నుంచి లింగంపల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొయినుద్దీన్ తల డివైడర్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే కొండాపూర్ జల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేయండి

కుత్బుల్లాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితాను సిద్ధం చేయాలని బూత్‌స్థాయి అధికారులకు(బీఎల్‌వోలు) ఈఆర్వో, డీసీ వి.నర్సింహ సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసేలా వారిని గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు.

'ఆల్విన్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి'

హైదర్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్, మొగులమ్మకాలనీలో కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ గురువారం పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, శశిధర్, రవి, రెహమాన్, లింగం, రఫీ, శివ, రాజా, బాలు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విజేత సూపర్ మార్కెట్ వార్షికోత్సవం



విజేత సూపర్ మార్కెట్ 25వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధినేత జగన్మోహన్‌రావు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.
- మియాపూర్, ఆంధ్రజ్యోతి

అక్రమ బోర్ల తొలగింపు



కాముని చెరువు వద్ద
బోరును తొలగిస్తున్న సిబ్బంది

కూకట్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లో పలుచోట్ల అక్రమంగా వేసిన బోర్లను అధికారులు గురువారం తొలగించారు. కొంత కాలంగా కాముని చెరువులో నీటిని తోడేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. చెరువు పరిసరాల్లో అక్రమంగా బోర్లు వేసి అక్రమార్కులు యథేచ్ఛగా నీటి దందా నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, వాటర్‌వర్క్స్, పోలీసు, జీహెచ్‌ఎంసీ అధికారులు అక్రమంగా వేసిన బోర్లను గురువారం తొలగించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని
కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నిజాంపేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి మండలం, నిజాంపేట్ గ్రామంలో సర్వే నంబరు 191లో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. సైదప్ప అనే వ్యక్తి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేపట్టాడు. ఈ విషయమై తహసీల్దార్ పూల్‌సింగ్‌కు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం మరలా ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ షేర్‌పాల్ గురువారం రెండు గదులను కూల్చివేయించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

కార్పొరేటర్ అక్రమ నిర్మాణం

● చర్యలు తీసుకోని అధికారులు

బాలానగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలకు అధికారులు అండగా నిలుస్తున్నారని, బాలానగర్ కార్పొరేటర్, ఆయన అనుచరులు, బీఆర్‌ఎస్ నేతల అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకుడు యుగంధర్‌రెడ్డి ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని గురువారం చెప్పారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ వివరణ కోరగా.. కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు అందిందని, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అక్రమ నిర్మాణాలు

గచ్చిబౌలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ గ్రామ సర్వే నంబర్ 28లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని నిలిపివేయాలని ఎంసీపీఐ(యు) డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. పేదలు నిర్మాణాలు చేస్తే అడుకునే నాయకులు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నిర్మిస్తున్న నిర్మాణాలను అడ్డుకోకపోవడం అన్యాయమన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు చేయండి : ఎమ్మెల్యే

దుండిగల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశించారు. గురువారం పలు విభాగాల అధికారులు, మతపెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు.

ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిలో రూ. 999కే వైద్య పరీక్షలు

నిజాంపేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఈనెల 7 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు రూ. 999లకే వైద్య పరీక్షలు చేస్తామని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు తెలిపారు. గురువారం వైద్య పరీక్షల ప్యాకేజీని ఆవిష్కరించారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

షాపూర్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య డిమాండ్ చేశారు. గురువారం షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు.